

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సహగమనం

**"మాలా రెడీనా?"** రాజారావు టి.వి ఆఫ్ చేస్తూ అరిచాడు.

"ఒన్ మినిట్."

పది నిమిషాల తర్వాత మాలతి పాయింటెడ్ హీల్స్‌ని టకటకలాడిస్తూ వచ్చింది.

"అరవై దాటాక అద్దం ముందు ఎక్కువసేపు ఉండాల్సి వస్తోంది రాజా" నవ్వింది.

"నాకంత శ్రమలేదు. టి షర్ట్ వేసుకుంటే చాలు. పదేళ్ళు తగ్గిపోతుంది వయసు" రాజారావు టీజింగ్‌గా చెప్పాడు.

"నిజమే. ఒప్పుకుంటా" అతని వంక ఆరాధనగా చూస్తూ చెప్పింది.

1980లో బి.యస్సీ చదువుతున్న మాలతికి హౌస్ సర్జన్సీ చేస్తున్న రాజారావుతో పెళ్ళయింది. ఇద్దరికీ మరో సంవత్సరం చదువున్నా పెద్దవాళ్ళు పెళ్ళి చేసేసారు. చదువు పూర్తయ్యాక రాజారావు ఎఫ్.ఆర్.సి.యస్ చేయడానికి ఇంగ్లండ్‌కి వెళ్తూ మాలతిని కూడా తీసుకెళ్ళాడు.

ఆత్మీయులు దగ్గరలేని ఆ చలిదేశంలో ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. ప్రేమతో నిండిన ఆ స్నేహం ఏళ్ళు గడిచేకొద్దీ మరింత చిక్కబడింది. దాదాపుగా ఇద్దరి అభిరుచులు ఒకటే.

నలభై ఏళ్ళ తర్వాత రాజారావు డాక్టర్ వృత్తి మానేసి బిజినెస్‌మేన్‌గా మారాడు. ఇండియా వచ్చి మెడికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇంపోర్ట్ బిజినెస్ మొదలు పెట్టాడు. వాళ్ళ ఏకైక కొడుకు ప్రీత్ లండన్‌లో ఆ వ్యవహారాలు చూస్తాడు.

మాలతి భర్తతో పగళ్ళు ఆఫీస్‌కి, రాత్రుళ్ళు క్లబ్స్ కి, పార్టీలకి వెళ్తూ బిజీ వుండే సొసైటీ లేడీ. వ్యాపార అవసరాలకోసం రాజారావు నగరంలోని ప్రముఖ క్లబ్స్‌లో సభ్యత్వం తీసుకున్నాడు. త్వరలోనే మాలతికి ఓ మిత్రబృందం ఏర్పడింది.

"ఇవాళ ఏం గాసిప్స్ చెప్పారు మీ గేంగ్?" రాత్రి పన్నెండున్నరకి కారు డ్రైవ్ చేస్తూ అడిగాడు రాజారావు.

"కొత్తవేం లేవు. కాకపోతే కార్డ్స్‌లో ఇవాళ ట్వంటీ థౌజండ్ గెలిచా" మాలతి అలసటగా వెనక్కివాలి చెప్పింది.

"మేమీ రోజు ఆడలేదు. ఒకాయన బిజినెస్ మేటర్స్ ఇంట్రెస్టింగ్‌గా చెపుతూంటే విన్నాం. డ్రైవర్ లేదు కాబట్టి రెండు పెగ్స్ మాత్రమే తీసుకున్నా" రాజారావు చెప్పాడు.

"లైఫ్ రోలర్ కోస్టర్ అయిపోయింది. రోజుకి కనీసం ముప్పై రెండు గంటలు ఉండాలి బాబూ. కనీసం వీకెండ్. ఇరవైనాలుగ్గంటలు బొత్తిగా సరిపోవడంలేదు" ఆరోపణగా చెప్పింది.

రాజారావు నవ్వాడు.

"ఇంగ్లండ్ వెళ్ళిన కొత్తల్లో తోచడంలేదు. అని ఒకటే గొడవ చేసేదానివి. ఆ తర్వాత నేను హాస్పిటల్ నించి వచ్చేసరికి ఇంట్లో ఉండేదానివికాదు. ఎంతైనా నీకు మనుషులు కావాలి. కార్డ్స్ ఆడకుండా ఉండలేవు."

"నిజం రాజా. మనుషులు లేకుండా నేనుండలేను. మాంచెస్టర్‌లోనైనా, హైద్రాబాద్‌లోనైనా నాకు ఎంతమంది స్నేహితులో" మాలతి చిరు గర్వంగా చెప్పింది.

సోమవారం మధ్యాహ్నం ఆఫీస్‌లో బిజీగా ఉన్నప్పుడు మాలతి ఫోన్ మోగింది సోఫియానించి.

"మాలా. రాత్రి నిజాం క్లబ్‌లో బర్త్‌డే పార్టీ ఉంది. వస్తున్నావుగా?" అడిగింది.

"వైనాట్? కానీ ఇలాంటివి వీకెండ్స్ ఉంటే బెటర్ సోఫీ. ఇంటికి త్వరగా వచ్చేయాలి. రేపు చాలా ముఖ్యమైన పనుంది ఆఫీస్‌లో" మాలతి చెప్పింది.

"మీ ఆఫీసేగా? ఆ పనేదో ఎల్లుండి చేసుకోకూడదూ?"

"మా ఆఫీస్ కాబట్టే వాయిదా వేయలేను" మాలతి పెద్దగా నవ్వింది. సాయంత్రం ఇంటికి వెళ్ళి స్నానం చేసాక క్లోజెట్ తలుపు తెరిచింది. అందులో హేంగర్లకి వేలాడుతున్న బట్టల్లో సగానికి పైన పూల డిజైన్‌లో ఉన్న దుస్తులే. అరచెయ్యి కన్నా వెడల్పయిన పూలు నించి సన్నటి మొగ్గలదాకా రకరకాల డిజైన్లు, రంగులతో ఫ్లోరల్ ప్రింట్ చీరలు, దుస్తులు ఉన్నాయి. వాటిలోంచి తెలుపుమీద లేతగులాబీ రంగు పూలున్న చీర తీసుకుని శ్రద్ధగా తయారైంది.

రాజారావు తను రాలేనన్నాడు.

"రేపు చాలా మీటింగ్స్ ఉన్నాయ్ మాలా. క్షమించెయ్" చెప్పాడు.

"ఏం పర్లేదు. నువ్వు ప్రిపేర్ అవుతూండు. నేనూ త్వరగానే వచ్చేస్తా." మాలతి భర్తకి చెప్పి పార్టీకి వెళ్ళింది. మర్నాడు వర్కింగ్ డే అవడంతో దాదాపు అందరూ పదకొండుకల్లా ఇళ్ళకి బయలుదేరారు. మాలతి ఇంటికి వచ్చేసరికి రాజారావు నిద్రపోతున్నాడు.

చీర మార్చుకుని మేకప్ తొలిగించి ముఖానికి నైట్ క్రీం రాసుకుని మాలతి అలసటగా పక్కమీద వాలింది.

అలవాటు ప్రకారం ఉదయం ఎనిమిది గంటలకి మెలుకువ వచ్చింది. రాజారావు ఇంకా నిద్రపోతూనే ఉన్నారు.

"నువ్వు వాకింగ్‌కి వెళ్ళకుండా ఇంతసేపు పడుకోవడం ఎనిమిదో వింత. ఒంట్లో బానే ఉంది కదా?" అతని నుదుటి మీద చెయ్యివేసింది. తర్వాత అనుమానంతో అతన్ని కుదిపింది. ఆ తర్వాత నిస్సహాయంగా అతనివంక చూస్తూండిపోయింది. ఆమె కళ్ళనుండి వెచ్చని కన్నీరు స్రవిస్తోంది.

ఆ తర్వాతి రోజులు ఆమెకి ఓ కలలా – పీడకలలా గడిచిపోయాయి. రాజారావు మరణించిన ఉదయం ఆమె లండన్‌లోని కొడుకు ప్రీత్‌కి ఒకే ఒక్క కాల్ చేసింది. ఆ తర్వాత ఏమైందో ఆమెకి జ్ఞాపకంలేదు. గంటలో బంధువులు, స్నేహితులు వచ్చారు. సాయంత్రానికి ప్రీత్ కుటుంబంతో వచ్చాడు. కార్యక్రమాలన్నీ ముగిసినా తల్లి పరిస్థితి అర్థం చేసుకున్న ప్రీత్ మరో నెల రోజులు ఉండిపోయాడు.

తర్వాత తల్లికి చెప్పాడు.

"నాన్నా, నువ్వు ఎలా ఉండేవాళ్ళో తెలుసమ్మా. కానీ నువ్వు ఎంత బాధపడినా నాన్న తిరిగిరారు కదా? నిన్నెప్పుడూ ఇలా చూడలేదు. ప్లీజ్ మమ్. నాకోసం నువ్వు ఈ ట్రామాలోంచి బయటకిరా" ప్రీత్ ఆమె ఒళ్ళో తలదాచుకుని పెద్దగా ఏడ్చాడు.

ఆ ఏడుపుకి మాలతి చలించిపోయింది. అతని తల నిమురుతూ చెప్పింది.

"అలాగే చిన్నా" ఆమెకూడా పెద్దగా ఏడ్చింది.

వారం తర్వాత ప్రీత్ అడిగాడు.

"అమ్మా. రెండు ఛాయిస్‌లు. నాతో వెనక్కి లండన్‌కి వచ్చేయడం, లేదా ఇక్కడే ఉండి మన ఆఫీస్ వ్యవహారాలు చూసుకోవడం. నేను మధ్య మధ్యలో వస్తూంటాను. నీకింకేదైనా ఆలోచన ఉంటే చెప్పు"

ఆ రాత్రి మాలతి ఆ విషయం మీద ఆలోచించింది. ఆమెకి లండన్ వెళ్ళడానికి మనస్కరించలేదు. ఇక్కడి ఆఫీస్ పనులు తనకి అలవాటే కాబట్టి ఒక వ్యాపకం ఉంటుంది అనుకుంది.

మర్నాడు ప్రీత్‌తో అదే చెప్పింది.

"అమ్మా! ఒక్కదానివే ఉండగలవా? ఎవర్నయినా "ఫ్రెండ్స్, చుట్టాలు..."

"వద్దొద్దు. నేనొక్కదాన్నే ఉండగలను. అలవాటు చేసుకోవాలిగా.." విషాదంగా నవ్వింది.

ప్రీత్ మాట్లాడలేదు. పని వాళ్ళందరికీ  జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి మాలతికి ఎందుకో తన భవిష్యత్తు ఏమిటనే ఆలోచన వచ్చింది. అమ్మమ్మ మాటలు గుర్తొచ్చాయి.

"తాత ఉన్నన్నాళ్ళూ నేను మహరాణిని. ఇంట్లో అంతా నా మాట ప్రకారమే నడిచేది. తాత దగ్గర్నించి, పాలేరుదాకా నేను చెప్పినట్లు వినేవారు. తాత హటాత్తుగా నాలుగురోజుల జ్వరంతో పోయాడు. ఆ పదిరోజులు నేను నా శోకంలో మునిగిపోయా. మేలుకుని చూస్తే ఏముంది? నన్ను మూలనపడేసారు. నా కోడలు మహారాణి అయింది. నేను పనికిరాని వస్తువునై పోయాను. ఉక్రోషంగా ఉండేది. దుఃఖంగా ఉండేది. పోయింది నేను కాదు మా ఆయన అని అరవాలనిపించేది. దాంతో  కోడలితో గొడవలు  చివరికి రాజీపడి మీ అమ్మదగ్గరకొచ్చి ఉంటున్నా."

తనకి అమ్మమ్మ పరిస్థితి లేదు. మరో విచిత్ర పరిస్థితి. తనది, రాజారావుది అద్భుతమైన అనుబంధం, అమ్మమ్మా, తాతయ్యల్లా యాంత్రికబంధం కాదు. తన సమస్య ఆధిపత్య పోరాటంకూడా కాదు. రాజారావుని మర్చిపోవడం లేదా మర్చిపోవాలని ప్రయత్నించడం కూడా వ్యర్థమే. కాకపోతే మనసుని వేరేవైపు మళ్ళించి ఆ జ్ఞాపకాలు పల్చబడేలా చేయాలి. పొద్దున్నించి సాయంత్రందాకా బిజినెస్ పనుల్లో బిజీగా ఉన్నా రాత్రుళ్ళు తనకో పెద్ద సమస్య. ఎలా గడపాలి? క్లబ్‌లో పేకాడుతూ, గాసిప్స్ వింటూ ఓ గ్లాస్ వైన్ తాగడమే పరిష్కారం. మరి తను అలా చేయగలదా? సొసైటీ ఏమనుకుంటుంది?  ఆలోచనలతో ఆమెకి నిద్రపట్టలేదు.

పొద్దున నిద్రలేచేసరికి ప్రీత్ మెసేజ్ ఉంది.

'మామ్. ఇవాళ నువ్వు ఆఫీస్‌కి వస్తావని అందరికీ ఇన్‌ఫాం చేసాను. డ్రైవర్‌కూడా రెడీగా ఉంటాడు. నాన్న గురించి మాట్లాడొద్దని అందరికీ చెప్పాను. నీకేం ఇబ్బంది ఉండదు. వెళ్ళు. దేనికైనా ఒక మొదలు ఉండాలిగా అమ్మా .

'అవును. రాజారావు విడోగా ఆఫీస్‌కి వెళ్ళాలి. ఇవాళ ఇబ్బందిగా ఉన్నా రేపటికి అలవాటైపోతుంది' మాలతి నిట్టూర్చింది.

స్నానమయ్యాక బట్టల అల్మరా తెరిచింది. పూల చీరలు కట్టుకోవచ్చా?

మాలతికి నవ్వొచ్చింది. మరి డ్రెస్‌ల మాటేమిటి?

అమ్మమ్మ మాటలు గుర్తొచ్చాయి.

'అవును. పోయింది రాజారావు. మాలతికాదు ' అనుకుంది.

ఆఫీస్ అలవాటైపోయింది. సాయంత్రాలు తోచక టి.వి చూడసాగింది. ఛానల్స్ మార్చడం తప్ప దేన్నీ పావుగంటకి మించి చూడలేకపోయేది. క్లబ్‌కి పోవాలనిపించేది. రాజారావు పోయి ఏడాదికాకుండా, కనీసం రెండు నెలలు కూడా కాకుండా వెళ్ళొచ్చా? అన్న ఆలోచనతో ఆగిపోయేది. రాజారావుమీద కోపం వచ్చి ఏడ్చేది.

'అంత తొందరేంటి రాజా. కొన్నేళ్ళు ఉండచ్చుగా' అనుకునేది. ఏదైనా ఏక్సిడెంట్‌లో ఇద్దరం ఒకేసారి పోతే ఎంత బావుండేది. ఈ ఒంటరితనం ఉండేది కాదుగా అని దేవుడ్ని తిట్టుకునేది.

నెల తర్వాత వచ్చిన ప్రీత్ తల్లిని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏంటమ్మా ఇలా అయిపోయావు? ఇంత చిక్కిపోయావేంటీ? డాక్టర్ దగ్గరకి వెళ్దామా?" ఆదుర్దాగా అడిగాడు.

"బానే ఉన్నాను. నాన్నని బాగా మిస్సవుతున్నారా" నీళ్ళు నిండిన కళ్ళతో చెప్పింది.

"నాతో వచ్చి కొన్నాళ్ళుండమ్మా. కొంచెం మార్పుగా ఉంటుంది" ప్రీత్ బ్రతిమాలాడు.

"నాన్న సంవత్సరీకాలు అయ్యాక వస్తాలే. ఇప్పుడూ వద్దు" చెప్పింది.

"అదీ మనిల్లేగా అమ్మా. ఈ పిచ్చి సెంటిమెంట్స్ ఇదివరకు లేవు నీకు" చిరుకోపంగా చెప్పాడు.

మాలతి మాట్లాడలేదు.

ప్రీత్ నాలుగురోజులుండి వెళ్ళిపోయాడు.

ఓ మధ్యాహ్నం సోఫియా ఫోన్ చేసింది.

"సాయంత్రం ఇంటికి వస్తా మాలా.. ఇంట్లో ఉంటావుగా?" అడిగింది.

"ఇంట్లోనే ఉంటున్నా" చెప్పింది.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చిన సోఫియా విభ్రాంతిగా చెప్పింది.

"గాడ్! మాలా ఏంటిలా అయిపోయావు? నీ గ్లామరంతా ఏమైంది? నువ్వు మళ్ళీ రొటీన్ జీవితంలోకి రావాలి. క్లబ్‌కి వస్తూండు. అన్నట్లు మన సుచరిత..."

చాలా రోజుల తర్వాత సోఫియా చెప్పే కబుర్లని ఆసక్తిగా విన్న మాలతికి తను ఎంత ఫన్ మిస్సవుతుందో అర్థమైంది. తను క్లబ్‌కి వెళ్తే ఎవరూ ఏమీ అనుకోరు. కానీ తనకే వెళ్ళడానికి మొహమాటంగా ఉంది. కాదు. గిల్టీ ఏమో?

ఆ సోమవారం రాత్రి తను ఒక్కతే పార్టీకి వెళ్ళినప్పుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజారావుకి గుండెపోటు వచ్చిందేమో, సమయానికి సహాయం అందక మరణించాడేమో అన్న గిల్టీ. అతని చావుకి పరోక్షంగా తను కారణమేమో అన్న అపరాధ భావం. ఆ కారణంగానే తాను క్లబ్‌కి వెళ్ళలేకపోతుంది. సాయంత్రాలు విసుగ్గా ఉంటున్నాయి. రోజుకి ఇరవైనాలుగ్గంటలు కాక పన్నెండు గంటలే ఉంటే బావుండేదనిపిస్తోంది.

ఆ రాత్రి లండన్‌లో ఉన్న ప్రీత్‌కి తల్లినించి ఒక మెసేజ్ వచ్చింది. 'సారీ ప్రీత్ బాబూ. జీవితం విసుగ్గా ఉంది. బోర్!'

మర్నాడు వంటమనిషికి జీవంలేని మాలతి దేహం ఆమె మంచం మీద కనిపించింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*